క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితునికి చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఎండీ వహీద్ అనారోగ్య సమస్యలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.2.5లక్షల చెక్కును సోమవారం ఆయన బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న అజారుద్దీన్ తదితరులు

పూడూరు: నిరుపేద అయిన చన్గోముల్ గ్రామ వాసి శేఖర్.. బీటెక్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్ రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీమ్‌ఖాన్, సర్పంచ్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరణ



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: కరోనా నేపథ్యంలో రుద్రారం గ్రామానికి ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. బస్సు పునరుద్ధరణకు పలుమార్లు ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు సోమవారం తాండూర్ ఆర్టీసీ డిపో అధికారులు బస్సు రుద్రారం రూట్‌కు నడిపించడానికి సరేనన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. దీంతో మూడేళ్లుగా పడిన ఇబ్బందులు నేటితో తొలగిపోయాయని గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్

పెద్దేముల్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పెద్దేముల్ ఉప సర్పంచ్ నల్లా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నల్లా వెంకట్‌రెడ్డి, పెండ్యాల అనంతకోటి, జక్కుల రాము, బ్యాగరి వెంకటయ్యతో పాటు పలువురు అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చిన్నారి వైద్యం కోసం..

తాండూరు రూరల్: గౌతపూర్ గ్రామానికి చెందిన అంజిలప్ప కూతురు స్వేచ్ఛ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. తన వద్ద ఉన్న డబ్బులతో పాటు అప్పు చేసి అంజిలప్ప కూతురికి వైద్యం చేయిస్తున్నాడు. ఆ తండ్రి బాధను చూసి స్పందించిన గ్రామ యువకులు.. చిన్నారి వైద్యం కోసం రూ.23,900 నగదును అతడికి అందజేశారు. దీంతో మానవత్వాన్ని చాటిన యువకులను పలువురు అభినందించారు.

బాగా చదువుకోవాలి

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోట్‌పల్లి సర్పంచ్ ఎస్.విజయలక్ష్మి ఆకాంక్షించారు. సోమవారం ఆమె కోట్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలన్నారు. హెచ్ఎం బాలేశ్వరయ్య, ఉపాధ్యాయుడు విశ్వం పంతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆధ్యాత్మిక దినోత్సవం

అనంతగిరి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అనంతగిరిగుట్ట ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్, ధర్మకర్త పద్మనాభం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం 6గంటలకు స్వామి వారికి అభిషేకం, 8గంటలకు వేద పారాయణం, 10.30 గంటలకు స్వామి వారి కల్యాణం, 12గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.



వికారాబాద్ అర్బన్: పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్, కమిషనర్



తాండూరు టౌన్: మొక్క నాటుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు



తాండూరు రూరల్: సిరిగిరిపేట్‌లో..

సర్వం హరిత శోభితం

- హరిత వనంతో తెలంగాణకు పచ్చలహారం
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- హరితోత్సవంలో వక్తలు

'కేసీఆర్ మానసపుత్రిక హరితహారంతో తెలంగాణ పచ్చదనంతో పరిఢవిల్లుతోంది. తొమ్మిదేళ్ల కాలంలో ఎనిమిది విడతలుగా సాగిన మొక్కల పండుగతో రహదారులన్నీ పూదోటలను తలపిస్తున్నాయి. అడవుల శాతం పెరిగి.. పర్యావరణానికి కవచంలా మారడమే కాకుండా.. కోతులు వనానికి వాపస వుతున్నాయి' అని వక్తలు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఊరూరా నిర్వహించిన హరితోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. నగటు జీవి మనుగడ సాధించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.

వికారాబాద్ అర్బన్: హరితహారం పథకంతో మున్సిపాలిటీ ఆకుపచ్చ వనాలతో కళకళలాడుతోందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొత్తగడి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన హరితోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసిన హరితహారం మొక్కలు.. మానువై ఫలాలు అందిస్తున్నాయని చెప్పారు. అనంతరం చైర్‌పర్సన్.. కమిషనర్ శరత్ చంద్రతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థలు, పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. తెలంగాణ మైనార్టీ గురుకుల (బాలుర) కళాశాలలో ప్రిన్సిపాల్ ఇఫత్ జహాన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటగా.. ఎన్టీఆర్‌నగర్ కాలనీ, యునైటెడ్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప మొక్కలు నాటారు. అధ్యాపకులు జీవన్‌సింగ్ ఠాకూర్, దేవయ్య, రాజు, చంద్రశేఖర్, రవూఫ్, నర్సింహులు, ఫీడ్ కోఆపరేషన్ సంస్థ సభ్యులు హైదర్, మన్సూర్, జావేద్, రియాజ్, ప్రధానోపాధ్యాయురాలు షబానా యాస్మిన్ పాల్గొన్నారు.

సిరిగిరిపేట్‌లో..

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జెడ్పీటీసీ మంజుల అన్నారు. తాండూరు మండలం సిరిగిరిపేట్‌లో జరిగిన హరితోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటడం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. అనంతరం వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచ్ రాధికతో కలిసి రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి, ఎంపీఓ రతన్ సింగ్, ఏపీఓ నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: దోర్నాల్‌లో నిర్వహించిన హరితోత్సవంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు. సర్పంచ్ సుజాతతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. వైస్ ఎంపీపీ విజయకుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..

మర్పలి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దశాబ్ది ఉత్సవాల మండల ప్రత్యేక అధికారి (డీఎల్‌పీఓ) అనిత అన్నారు. సిరిపురం మినీ బృహత్ పల్లెప్రకృతి వనంలో హరితోత్సవం సందర్భంగా.. ఉపాధిహామీ పథకం అంబుడ్స్‌మెన్ రాములు, ఎంపీపీ లలిత, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, సర్పంచ్ మల్లయ్యతో కలిసి ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీఓ మహేశ్, పంచాయతీ కార్యదర్శి నాగయ్య, టీఏ భాస్కర్, ఎఫ్ఏ వెంకటయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



బషీరాబాద్: నవల్గాలో..

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మొక్కల పెంపకం వలన ఆహ్లాదకరమైన వాతవరణం నెలకొంటుందని, తద్వారా సగటు జీవి ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి వాజుద్దీన్ అన్నారు. హరితోత్సవంలో ఆయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. వైద్యాధికారి మాధవి, చంద్ర ప్రకాష్, మహేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా..

బషీరాబాద్: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని ఎంపీపీ కరుణ అన్నారు. హరితోత్సవంలో నవల్గా రోడ్డు పొడవునా జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్‌తో కలిసి ఆమె మొక్కలు నాటారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. హరితోత్సవంలో కొడంగల్ మండలం చిన్ననంది గామ గేటు నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా(ఎవెన్యూ ప్లాంటేషన్) మొక్కలు నాటారు. పట్టణంలోని పశువైద్యశాల ఆవరణలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, ఏడీ ప్రహ్లాద్, డాక్టర్ పరమేష్, జేవీఓ వెంకటయ్య మొక్కలు నాటారు. సర్పంచ్ సావిత్రమ్మ, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, నాయకులు సాయిలు, డాక్టర్ మహేందర్, ఏఎస్ఎం అనురాధ, ఏపీఓ రాములు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు కృషి..

దోమ: నాటే మొక్కల సంరక్షణకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి సూచించారు. హరితోత్సవం సందర్భంగా ఊటుపల్లి బృహత్ పల్లె ప్రకృతి వనంలో వారు మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీఓ జయరాం, ఏపీఓ దస్తయ్య, ఈసీ చంద్రశేఖర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎంపీటీసీ అనిత, సర్పంచ్ నర్సింహులు, ఎస్ఐ విశ్వజన్ ఉన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: హరితోత్సవంలో పలు గ్రామాల్లో సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. జైదుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు పాల్గొని మొక్కలు నాటారు. జీపీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. హరితోత్సవంలో ఆమె పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. చెట్లను పెంచడం వలన వర్షాలు పుష్కలంగా కురిసి.. వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయన్నారు. సీఐ వెంకటేశం, ఎస్ఐ విజయ్‌ప్రకాశ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ ఉన్నారు.



దోమ: మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎస్ఐ విశ్వజన్, సిబ్బంది



ధారూరులో..



మర్పల్లిలో..



కుల్కచర్లలో..



కొడంగల్ రూరల్‌లో..

కార్మికులు లేబర్ కార్డు పొందండి

కుల్కచర్ల: కార్మికులు ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డు పొంది, లబ్ధిపొందాలని జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో లేబర్ కార్డుదారులకు ఉచితంగా వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా లేబర్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. లేబర్‌కార్డు ఉండటం వలన ఎదైనా ప్రమాదం జరిగితే.. ఆర్థిక సహాయం అందుతుందని, వ్యక్తులు మరణిస్తే రూ.6 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని తెలిపారు. గర్భిణుల మొదటి కాన్పుకు రూ.30 వేలు అందుతాయని పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారి నుంచి అర్జీ స్వీకరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, జన్ సహాస్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.



కార్డుదారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బడిని ఆహ్లాదకరంగా ఉంచుకోవాలి

- డీపీఓ తరుణ్‌కుమార్
- నేడు విద్యాదినోత్సవం సందర్భంగా పాఠశాల భవనం పరిశీలన

కుల్కచర్ల: పాఠశాలలను ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో మంగళవారం జరగనున్న విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించేందుకు సోమవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మన ఊరు-మనబడి కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మహేశ్ రెడ్డితో కలిసి పాఠశాల భవనాలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, చౌడాపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మ్యా, ఎస్ఎంసీ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్ కుమార్

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రతి పాఠశాలలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎంఈఓ వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయాల్లో జాతీయ పతాకం ఆవిష్కరించాలని, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అన్ని సర్కారు బడుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: తెలంగాణ విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ తిరుమలస్వామి కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు. ప్రతి పాఠశాలలో 7.30 గంటల నుంచి 8.45 గంటల వరకు జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. అనంతరం భవనాలు, డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవాలతో పాటు.. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని సూచించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం..
- మండల విద్యాధికారి హరిశ్చందర్



దాడితండాలో నూతన అడ్మిషన్లు తీసుకుంటున్న ఎంఈఓ

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. సోమవారం పరిగి మండలం దాడితండా, మల్కాయపేట తండాల్లో ఇంటింటికీ తిరిగి ప్రాథమిక పాఠశాలకు నూతన అడ్మిషన్లు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో ప్రభుత్వం.. అన్ని రకాల సదుపాయాలను సమకూర్చుతుందన్నారు. వీటిలో చదివే విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించి డబ్బులు వృథా చేసుకోరాదని సూచించారు. మన ఊరు-మనబడితో పాఠశాలలు కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా మారాయని, కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

బీసీల ఐక్యత కోసం పోరాటం

యాలాల: బీసీల ఐక్యత కోసం నిరంతరం పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం యాలాల మండల అధ్యక్షుడు చెన్నారం లక్ష్మణచారి అన్నారు. సోమవారం నగరంలోని కాచిగూడలో నిర్వహించిన సంఘం స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కృషి ఎంతగానో ఉందన్నారు. బీసీల సంక్షేమం, ఐక్యత కోసం జాతీయ నాయకుల సూచనలు, మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తామన్నారు. అనంతరం లక్ష్మణ్‌ను ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ సత్యనారాయణ, నీలం వెంకటేశ్‌లు ఘనంగా సన్మానించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మర్పల్లి: కోట్‌మర్పల్లి వాసి అయిన మంగలి రాములు(56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్‌ట్రస్ట్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి.. రాములు అంత్యక్రియల కోసం ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఎంపీటీసీ ద్వారా అందజేశారు.

పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

యాలాల: నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు డప్పు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ డబుల్ ఇళ్లు కేటాయించాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా బీసీలకు ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం గడువు తేదీని పొడగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్, రమేష్, సాయిలు, రాజు ఉన్నారు.

పూడూరులో..

పూడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అర్హులకు ఇంటిస్థలాల పట్టాలు, ప్రభుత్వ భూమిలో లేఅవుట్‌లు చేసి ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్నవారికి గృహ నిర్మాణానికి రూ.15లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దిలీప్, నాయకులు జంగయ్య, రాంచందర్, లింగం, అంజయ్య, నర్సింహులు, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పల్లెబాటతో ప్రజాధనం దుర్వినియోగం!

కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

పూడూరు: పల్లెబాట పేరిట ప్రజాధనాన్ని బీఆర్ఎస్ పార్టీ దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ఆరోపించారు. సోమవారం మన్నెగుడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని కానీ.. పల్లెబాట పేరుతో గ్రామాల్లో పర్యటనలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేయాల్సింది పల్లెబాట కాదని, ప్రజా సమస్యలపై దృష్టి సారించి, పరిష్కార మార్గం చూపాలని హితవు పలికారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజిద్‌ఖాన్, డీసీసీ కార్యదర్శి అజీంపటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైఫ్‌ఖాన్, నాయకులు మోహిన్‌పాష, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

ముదిరాజ్‌లను రాజకీయంగా గుర్తించాలి

పెద్దేముల్: రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముదిరాజ్‌లకు గుర్తింపులేదని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి, తమకు తగిన గుర్తింపును ఇవ్వాలని సంఘం పెద్దేముల్ మండల అధ్యక్షుడు వీరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్, ఎమ్మెల్యే సీట్లను కూడా కేటాయించాలని, ముదిరాజ్‌లను డీ గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలన్నారు. అంతే కాకుండా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కులవృత్తి ఆర్థిక సాయంతో పాటు సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లకు వర్తింపజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, బస్సయ్య, నారాయణ, తలారి శ్రీను, మల్లేశం, వీరప్ప, అంజి, దుగ్గాపూర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం మండల అధ్యక్షుడు వీరప్ప